# బీఆర్ఎస్‌ది 'మాఫీ' పాలన

- ఎన్నో రకాల పన్నులు మాఫీ చేసిన ఘనత కేసీఆర్‌ది
- కేటీఆర్‌పై కాంగ్రెస్ నేత కేకే విమర్శలు మూర్ఖత్వం
- మరోసారి పునరావృతమైతే తగిన గుణపాఠం చెబుతాం
- బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
- మహిళలను విమర్శించడం సంస్కృతి కాదు
- జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, తదితరులు

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 12: గత ప్రభుత్వాలు మోపిన వివిధ రకాల శిస్తు(పన్ను)ను మాఫీ చేసి సుభిక్షమైన పాలన అందించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కొనియాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ విప్లవాత్మకమైన అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగించారని కొనియాడారు. ఆయన నాయకత్వంలో రైతులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు సంతోషకరమైన జీవనం సాగించారని తెలిపారు. కేసీఆర్ పాలన దేశానికే మార్గదర్శకంగా నిలిచిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లే విధంగా కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. భూమి శిస్తును రద్దు చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. గీత కార్మికుల సంక్షేమాన్ని కోరుతూ తాటి, ఈత చెట్లపై పన్ను మాఫీ చేశారని, ఆటో డ్రైవర్ల పన్నును ఎత్తివేశారని గుర్తు చేశారు. మత్స్యకారుల సొసైటీల పన్ను రద్దు చేసి ఉచితంగా చేప పిల్లలను అందించారన్నారు. నేతన్నలకు యారన్ సబ్సిడీ ఇవ్వడంతో పాటు ఉపాధి మార్గాన్ని మెరుగుపరిచారన్నారు. పచ్చ కామెర్లు వచ్చిన వ్యక్తికి లోకమంతా పచ్చగా కనిపించిన విధంగా కేకే మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నాడని ఆరోపించారు. సిరిసిల్లలో నాలుగు రోడ్లు, నాలుగు డివైడర్లు మాత్రమే పనులు జరిగాయని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సిరిసిల్ల మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత కేటీఆర్‌దేనన్నారు. ప్రతి గ్రామంలో హరితహారం ద్వారా పచ్చలహారంగా మార్చు చేశారన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించామన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా అభివృద్ధిలో కేటీఆర్ మార్క్ కనిపిస్తున్నదన్నారు. కేకే మహేందర్‌రెడ్డి చేసిన విమర్శలు నిజమైతే ప్రజలు ఆయన్ను ఏనాడో నమ్మేవారని, అక్కున చేర్చుకునేవారన్నారు. ప్రజలు ఎన్నిసార్లు తిరస్కరించినా కేకే మహేందర్‌రెడ్డి మనసు మారకపోవడం బాధాకరమన్నారు. ప్రజలు ఆశీర్వదించిన నాయకుడిని విమర్శిస్తే ప్రజలు సహించబోరన్నారు. ప్రజల ఆలోచనలను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అవసరాలు గుర్తించి వారికి అందుబాటులో ఉండి పని చేస్తామని పేర్కొన్నారు.

**మహిళలను అవమానపరచడం సరికాదు: జడ్పీ చైర్‌పర్సన్ అరుణ**

కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలు ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన నేత కేసీఆర్ అని కొనియాడారు. రైతాంగానికి పెద్దపీట వేసి వ్యవసాయాన్ని పండుగ చేశారని, నేతన్నకు ఉపాధి కల్పించి వారికి అండగా నిలిచారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించడంతో పాటు రాష్ట్రంలో నిరంతర విద్యుత్‌ను అందించారన్నారు. ఆరు గ్యారెంటీల ద్వారా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్నింటినీ విజయవంతంగా అమలుచేయాలని సూచించారు. గంభీరావుపేటలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి మహిళలను అవమానపరిచేలా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళలను గౌరవించుకునేది తెలంగాణ సంస్కృతి అని చెప్పారు. సమావేశంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నాయకులు దార్నం లక్ష్మీనారాయణ, కుంబాల మల్లారెడ్డి ఉన్నారు.

## విద్యార్థినికి అభినందన


నక్షత్రను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథ్, తదితరులు

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 12: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని నక్షత్ర జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథ్ తెలిపారు. పాఠశాలలో మంగళవారం నక్షత్రను పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథ్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీకాంత్, కోచ్ గౌతమ్, అనిల్ అభినందించారు.

## చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు

- రక్షించిన లేక్ పోలీసులు

రాంనగర్, డిసెంబర్ 12: డ్యాంలో చేపలు పట్టేందుకు తెప్పపై వెళ్లిన వ్యక్తి మంగళవారం ఉదయం కురిసిన మంచుతో దారి తెలియక డ్యాం అవతలి వైపు వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు రెస్క్యూ సిబ్బంది సహాయంతో తీసుకురావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. లోయర్ మానేరు డ్యాంలో ఉదయం 5 గంటల సమయంలో సప్తగిరికాలనీకి చెందిన ఎరవేణి మల్లయ్య చేపలు పట్టడానికి వెళ్లాడు. మంచు ఎక్కువగా ఉండడం, దృష్టి మందగించగా హన్మాజీపల్లి గుట్టల వైపు వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న లేక్ పోలీస్ ఆర్ఎస్ఐ సురేశ్, కానిస్టేబుల్ వీరస్వామి, టూరిజం బోట్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, రెస్క్యూ టీం జంకుటి ఆనంద్, తిప్పరవేణి మల్లేశం సహాయంతో మల్లయ్య ఉన్న ప్రాంతాన్ని తెలుసుకొని వెళ్లి సురక్షితంగా తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## మంత్రిని కలిసిన పీఆర్టీయూ టీఎస్ నాయకులు


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 12: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం పీఆర్టీయూ టీఎస్ జిల్లా శాఖ అధ్యక్షుడు ముస్కు తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎల్ వెంకటేశ్వర్ రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్, మురళి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభలు


గోపాల్‌పూర్ గ్రామ సభలో మాట్లాడుతున్న అధికారులు

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 12: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్, గోపాల్‌పూర్, చామనపల్లి, చెర్లభూత్కూర్ గ్రామాల్లో మంగళవారం సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో శోభ, సర్పంచులు బోగొండ లక్ష్మి, పురుమల్ల శ్రీనివాస్, దబ్బెట రమణారెడ్డి, ఊరడి మంజుల, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు వేల్పుల నారాయణ, బుర్ర తిరుపతి గౌడ్, ఉపాధి హామీ టెక్నీషియన్లు పద్మ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, డిసెంబర్ 12: నగరంలోని 11కేవీ మంకమ్మతోట ఫీడర్ లో కొత్త డీటీఆర్ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, కశ్మీర్ గడ్డలో కొంత ప్రాంతం, గోపాల్ రావు బిల్డింగ్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## హనుమాన్ చాలీసా పారాయణం

చొప్పదండి, డిసెంబర్ 12: పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో జ్ఞాన సరస్వతీ సేవాదళ్ ఆధ్వర్యంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయంలో ప్రధాన అర్చకుడు సింహాచలం జగన్మోహన్ స్వామి, అర్చకుడు భాష్యం నవ్య కుమార్ ప్రత్యేక పూజలు చేశారు.

## ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి

చొప్పదండి, డిసెంబర్ 12: ఎస్సారెస్పీ నీటిని వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం అధ్యక్షుడు గుర్రం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, కల్లెం భూంరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మక్క, వరి పంటలు సాగు చేస్తున్నందున నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

## నోట్ బుక్స్ పంపిణీ

హౌసింగ్‌బోర్డ్ కాలనీ, డిసెంబర్ 12: స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని సరస్వతీనగర్‌లో గల 'కపిల్ బాల కుటీర్' లో హమ్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు గంధ్ర శ్రీకాంత్ రావు పుట్టిన రోజును పురస్కరించుకొని విద్యార్థులకు నోట్ బుక్స్, పండ్లు, ఇతర సామగ్రి అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్, రాజు, అఖిల్,మనీష్, బాలకుటీర్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే ఎల్లమ్మ చెరువు కట్ట మరమ్మతులకు నిధులు

గంగాధర, డిసెంబర్ 12: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గంగాధర ఎల్లమ్మ చెరువు కట్ట మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్లమ్మ చెరువు కట్ట మరమ్మతులకు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కట్ట మరమ్మతు పనులు కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

## ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

తెలంగాణచౌక్, డిసెంబర్ 12: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు జీవనోపాధి కోల్పోయే పరిస్థితులు ఉన్నాయని కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షుడు మద్దెల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ఆటో యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఆయన జిల్లా కమిటీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆటో డ్రైవర్ల జీవన భృతి కోసం ప్రతి నెలా రూ. 15 వేల చొప్పున అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు శ్రీనివాస్, జనార్దన్, రవీందర్ పాల్గొన్నారు.

## వినతి పత్రం అందజేత

చొప్పదండి, డిసెంబర్ 12: పట్టణంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని యువజన సంఘం నాయకులు మంగళవారం జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో తాడూరి శివకృష్ణ, తొర్తి శ్రీనివాస్, జాగిరి సాయి గణేశ్, అనుమండ్ల కొటేశ్, గంగు సంపత్, బొడిగె శ్రీకాంత్ తదితరులున్నారు.

## చీరల పంపిణీ

విద్యానగర్, డిసెంబర్ 12: మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అమావాస్య సందర్భంగా విద్యానగర్‌లోని దివ్యాంగుల కాలనీలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ, పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో మాధవి, శ్రీనివాస్, శైలజ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో చికిలం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## రూ. 20.30 కోట్ల పెట్టుబడి సాయం

కరీంనగర్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినట్లుగానే ఎకరాకు రూ. 5 వేల చొప్పున యాసంగి సీజన్‌కు ప్రస్తుత ప్రభుత్వం అందిస్తోంది. జిల్లాలో 2.02 లక్షల మంది రైతులు ఉండగా మొదటి రోజు 76,963 మందికి రూ. 20 కోట్ల 30 లక్షల 789 ఆయా రైతుల ఖాతాల్లో జమైనట్లు జిల్లా వ్యవసాయాధికారి వాసిరెడ్డి శ్రీధర్ తెలిపారు.

## రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా సంతోష్‌రెడ్డి

తెలంగాణచౌక్, డిసెంబర్ 12: రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర కమిటీని మంగళవారం హైదరాబాద్‌లోని రెడ్డి సంఘ కార్యాలయంలో నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఏనుగు సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంది తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా భూంపల్లి రాఘవరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు చంద్రారెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, సుమన్ రెడ్డి, వెంకటరెడ్డి, భూంరెడ్డి పాల్గొన్నారు.